**SRINIVASA BALABHARATI - 92**
***(Children Series)***

**GOUTHAMA BUDDHUDU**

*By*
***S. Rajannakavi***

T.T.D.Religious Publications Series No.: 947

© All Rights Reserved

First Edition : November, 2010.

Second Edition : 2015

Copies :

*Published by*

**Dr. D. SAMBASIVA RAO I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*D.T.P. :*

Editor-in-Chief Office, TTD, Tirupati.

*Printed at:*
Tirumala Tirupati Devasthanams Press,Tirupati.

**శ్రీనివాస బాలభారతి - 92**

# గౌతమ బుద్ధుడు

**రచన**
**ఎస్. రాజన్నకవి**

ప్రచురణ
**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**
**2015**

## ఆముఖం

చిన్నపిల్లల మనసులు చల్లనైనవి, నిర్మలమైనవి. చక్కగా పెరిగిన పిల్లలు భావిభారత పౌరులై మంచి సభ్యత సంస్కారం పెంచుకొని, తమ కుటుంబానికి, దేశానికి కూడ పేరుప్రతిష్ఠలను సంపాదించి గర్వకారణమౌతారు. మన ఇతిహాసాల్లోని మహాపురుషులు, మహాపతివ్రతలు ఎలాంటివారు, వారంత గొప్పవారెలా అయినారనే విషయం, వారికథలు చెపుతూ పిల్లలకు తెలియజేయ గలిగితే, వాటి ప్రభావం లేతమనస్సులపైన చక్కని సంస్కారముద్రలను వేయగలుగుతుంది. అవి భవిష్యత్తులో వారికెంతగానో ఉపయోగపడతాయి.

ఈ ఉద్దేశ్యంతోనే “శ్రీనివాస బాలభారతి” అనే పుస్తకమాలను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురిస్తోంది. ఇందులో మన భారతదేశంలో అనేక ఆదర్శాలలో ప్రసిద్ధులైన మహాత్ముల చరిత్రలు చిన్న చిన్న వాక్యాలలో చక్కని కథాకథన పద్ధతిలో చెప్పడం జరుగుతుంది. చిన్నారి బాలలు వీటిని బాగా ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నాం.



కీ.శే.డా॥ ఎస్.బి.రఘునాథాచార్యగారు రూపొందించిన ఈ ప్రణాళికను కొనసాగిస్తూ అదే శీర్షికన చాలా పుస్తకాలను ప్రచురింపజేయటంతోపాటు వాటిని హిందీ, ఆంగ్లం మున్నగు ఇతర భాషల్లోనికి అనువదింపజేస్తున్న ప్రచురణలవిభాగం ముఖ్యసంపాదకులు అభినందనీయులు. ఈ ప్రణాళికలో సహకరించిన రచయితలకు, కళాకారులకు మా ధన్యవాదాలు.

**కార్యనిర్వహణాధికారి**
తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి.

# ఒక్క మాట

చిన్నపిల్లల్లో ధార్మిక జ్ఞానాన్ని కల్గించాలని, బాల్యంలో కల్గిన జ్ఞానం జీవితాంతం వారికి ఉపకరిస్తుందనే ఉద్దేశ్యంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఈ 'శ్రీనివాస బాలభారతి' పథకాన్ని ప్రారంభించింది. దీనికి అప్పట్లో ప్రధాన సంపాదకులుగా ఉండిన ప్రముఖ పండితులు, రచయితలు, మాజీ ఉపకులపతి డా॥యస్.బి.రఘునాథాచార్యులవారు ఈ గ్రంథాలను పరిష్కరించి తీర్చిదిద్దారు. వీరి నేతృత్వంలో కొన్ని వేల ప్రతులను చిన్న పిల్లలకు అందించడం జరిగింది.

మన ఇతిహాసాల్లోని మహాపురుషులు, మహా పతివ్రతలు, మహావీరులు భారతీయ సంస్కృతికి చక్కని పునాదులు.వారి జీవిత గాథల్ని సరళ సుందరశైలిలో, అందమైన ముద్రణతో వెలుగులోకి తేవడం జరిగింది. ప్రస్తుతం ఆ పుస్తకాలతో పాటు మరికొన్నింటిని కొత్తగా చేర్చి దేవస్థానం ముద్రించింది. భావి భారత పౌరులైన పిల్లలకు ధార్మిక సాహిత్య పరిచయం కల్గించాలనే సత్సంకల్పంతో తి.తి.దే. వీటిని అందిస్తోంది.

తల్లిదండ్రులే పిల్లలకు ప్రథమ గురువులు. కనుక వారు కూడా ఈ 'శ్రీనివాస బాలభారతి' రచనలను ఆదరించి, పఠించి వాటి ప్రాముఖ్యమును పిల్లలకు తెలియచేసి వారిచేత చదివించాలి. అప్పుడే ఆ బిడ్డలు అందరూ ఆదర్శవంతులుగా తీర్చిదిద్దబడతారనడంలో సందేహం లేదు. నేటి మొక్కలే రేపటి వృక్షాలు కనుక ఇప్పటినుండి పిల్లలలో నైతికములైన విలువలను, ఆధ్యాత్మిక చింతనను పెద్దలు అలవాటుచేస్తే భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా వెలుగొందుతూ ఆదర్శజీవితం సాగించగలరు. ఆ ఈ సంకల్పానికి ఈ బాలభారతి గ్రంథాలు చేయూతనివ్వగలవని మా విశ్వాసం.

ముఖ్య సంపాదకులు

# గౌతమ బుద్ధుడు

జీవితం దుఃఖమయం. ఆశ దుఃఖానికి మూలం. కోరికలు నశిస్తే జన్మరాహిత్యం కలుగుతుంది. అదే నిర్వాణానికి చక్కని రాజమార్గం. బుద్ధుని జీవితం నేర్పిన పరమసత్యం ఇదే!

ధర్మంపై అధర్మం విజృంభిస్తుంది. సత్యంపై అసత్యం నాలుకలు సాచింది. మానవులు మందబుద్ధులై మంద భాగ్యులై, సోమరులై, అల్పాయుష్కులైపోతున్నారు. ఇట్టి పరిస్థితుల్లో ఆత్మకు శాంతి, సౌఖ్యం ఎలా లభిస్తాయి? ఈ సమస్యను పరిష్కరించడానికి బుద్ధుని రూపంలో భూలోకంలో భగవంతుడవతరించాడు.

**జననం :**

అది క్రీస్తుపూర్వం 6వ శతాబ్దం. కోసలదేశం సస్య శ్యామలమై తులతూగుతూ ఉంది. దానికి ఉత్తరభాగంలో పవిత్ర గంగానది; కపిలవస్తుపురం దాని రాజధాని. ఆ దేశాన్ని



శుద్ధోదన మహారాజు పరిపాలిస్తున్నాడు. ఆయన పరిపాలనలో ప్రజలు ఏ లోటు లేకుండా స్వేచ్ఛగా జీవిస్తున్నారు. ధర్మదేవత నాలుగు పాదాలా నడుస్తూ ఉంది.

శుద్ధోదనుడు మహాపరాక్రమవంతుడు, ప్రతిభా వంతుడు. ఆయనకు ఇద్దరు భార్యలు. ఒకరు మాయ, మరొకరు గౌతమి. వారిరువురికీ సంతానం లేదు. ఎలాగైనా తమ వంశాన్ని నిలబెట్టగల ఒక పుత్రుని పొందాలి. ఈ కోరిక ఆవేదనగా మారింది. ఆ దంపతులు సంతానం కోసం ఎందరో దేవుళ్ళకు మ్రొక్కారు. ఎన్నెన్నో పుణ్యతీర్థాల్లో మునిగారు.

ఒకనాటి రాత్రి మాయాదేవి ఒక చిత్రమైన కలగన్నది. ఒక తెల్లని ఏనుగు తనకు మూడుసార్లు ప్రదక్షిణంచేసి తన దక్షిణభాగం గర్భంలో ప్రవేశించింది. ఇంతలో మెలకువ వచ్చింది. ఆమె వెంటనే భర్తను లేపి స్వప్న విషయం చెప్పింది. వెంటనే పురోహితులను, మహర్షులను పిలిపించాడు రాజు. స్వప్నఫలితాన్ని అడిగాడు.

"రాజా! ఇది మంచి స్వప్నం. సకల కళాకోవిదుడు, ధర్మపాలకుడూ అయిన ఒక మహానుభావుడు పుత్రుడుగా జన్మిస్తాడు" అని శాస్త్రజ్ఞులు పలికారు.



ఈ శుభవార్త విని రాజదంపతులు ఎంతో ఆనందించారు. అన్నట్లే కొంతకాలానికి మాయాదేవి గర్భవతి అయింది. పదినెలలు గడిచాయి. నిండు చూలాలు పుట్టింటికి వెళ్ళాలని కోరింది. అభ్యంతరం చెప్పకుండా రాజు ఆమె ప్రయాణానికి ఏర్పాట్లన్నీ చేయించాడు. దేవదాహనగరం ఆమె పుట్టినిల్లు. వెళ్ళే మార్గమంతా చక్కగా అలంకరింపజేశాడు. రాణి మాయాదేవి బంగారు పల్లకీలో ఉల్లాసంగా వెళ్తూ ఉంది. దారిపొడవునా పుష్పఫలభారంతో వంగిన వృక్షాల సొగసు చూస్తూ ఆనందిస్తూ ఉంది. ప్రియసోదరి గౌతమి చాలామంది చెలికత్తెలు పరిచారికలు వెంట వస్తున్నారు.

పగలంతా ప్రయాణం సాగింది. సాయంకాలమైంది. లుంబినీవనం సమీపించే కొద్దీ మాయాదేవికి అలసట ఎక్కువైంది. ఆ వనంలో ఒక సాల వృక్షం నీడలో విశ్రాంతికి ఏర్పాటు చేశారు. మాయకు పురుటి నొప్పులు ప్రారంభ మయ్యాయి.

బ్రహ్మలిఖితం తప్పింప ఎవ్వరి శక్యం? అంతః పురంలో, రాజలాంఛనాలతో పురుడు పోసుకోవలసిన

మహారాణి లుంబినీవనంలో, సాలవృక్షం నీడలో చక్కని బాలుని ప్రసవించింది. అది వైశాఖపూర్ణిమ. పుట్టిన శిశువు పాదాలనుండి కమలాలు పుట్టాయి. దేవతలు పుష్పవృష్టి కురిపించారు. గంధర్వుల అమరగానం విన్పించింది.

**నామకరణం :**

కొన్ని నిమిషాల్లో ఈ వార్త రాజ్యమంతటా వ్యాపించింది. శుద్ధోదనుడు పరమానందభరితుడయ్యాడు. సకల బంధుమిత్ర పురోహిత సమేతంగా లుంబినీవనం చేరి కుమారుని చూచి పొంగిపోయాడు. శాస్త్రవేత్తలను పిలిపించాడు. వారు జాతకం లెక్కించి 'బాలుడు రాజ్యం పాలించే చక్రవర్తి అవుతాడు. లేదా బుద్ధుడై ప్రపంచాన్ని దుఃఖాన్నుండి రక్షిస్తాడు. జగద్గురువు అయ్యే లక్షణాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి' అని చెప్పారు.

గౌతముడు జన్మించిన నాటినుండి మహారాజుకు సర్వార్థాలు సిద్ధించాయి. ఆ కారణంగా బాలునికి సర్వార్థ సిద్ధుడని నామకరణం చేశారు. గౌతమగోత్రుడు కావడంవల్ల గౌతముడను పేరు కూడా వాడుకలోకి వచ్చింది.



**మాతృవియోగం :**

గౌతముడు జన్మించిన ఏడవనాడు మాయాదేవి పుత్రుని ఒడిలో పరుండబెట్టుకున్నది. తనివిదీరా ఆనందిస్తున్నది. క్రమంగా కన్నీరు కార్చడం ఆరంభించింది. అది చూచి గౌతమి చంటి బిడ్డను మాయ ఒడినుండి తన ఒడిలోకి తీసుకొని ఆమె కన్నీళ్ళు తుడిచింది. కడసారిగా కన్నబిడ్డను ముద్దాడి కళ్ళు మూసింది మాయ, అంతే! మూసినకళ్ళు మళ్ళీ తెరవలేదు. మాయ మరణంతో శుద్ధోదనుని జీవితం అంధకారమయమైంది. పురమంతా వెల వెలబోయింది. ఒకవైపు కుమారుని జననం. మరొకవైపు భార్యా మరణం రాజు మనస్సును కలచివేశాయి. అయినా మనోనిగ్రహంతో ఆ బాధనంతా తనలోనే అణచుకున్నాడు.

పుత్రోదయం కారణంగా ప్రజలకు, పురోహితులకు దానధర్మాలు చేశాడు. కాలం గడుస్తున్న కొద్దీ శుద్ధోదనుడు పుత్రుని చూస్తూ భార్య సంగతి మరచిపోసాగాడు. సిద్ధార్థుని పెంచే భారం పినతల్లి గౌతమి స్వీకరించింది.



జ్యోతిష్కుల మాట మేరకు కుమారుని హృదయంలో విరక్తిభావాలు ప్రవేశింపకూడదు. విరక్తిని ప్రబోధించే దృశ్యాలు కంటపడకూడదు. అందువల్ల మహారాజు ఒక గొప్ప సౌధాన్ని నిర్మించాడు. అందులో బాలుని పెంచడం ప్రారంభించారు.

సిద్ధార్థుడు దిన దిన ప్రవర్ధమానుడై పెరుగుతున్నాడు. అతని మనస్సు వైరాగ్యం వైపు మళ్ళకుండా రాజపురోహితులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. సౌధమంతా సుగంధద్రవ్యాలతో నింపివేశారు. సంగీత నృత్య విలాసినీమణులను అతని సేవకై నియోగించారు. వారు తమ గానామృతంతో నృత్య ప్రదర్శనలతో చిన్నారి మనస్సు పరాయత్తం కాకుండా కాపాడుతున్నారు.

**ధర్మదేవత మరోరూపం :**

ఒకనాడు హిమాలయాల్లో తపస్సు చేసుకుంటున్న అసితమహర్షి సిద్ధార్థుని చూడటానికి బయలుదేరాడు. అతడు ఎన్నో యుగాల నుండి తపస్సు చేస్తున్నాడు. కపిలవస్తుపుర సౌధానికి వచ్చాడు. శుద్ధోదనుడు భక్తితో అర్ఘ్యపాద్యాది విధులతో పూజలు చేశాడు. 'మహాత్మా! తమ రాకకు కారణమేమి?' అని సవినయంగా అడిగాడు. "రాజా! నీ కుమారుని చూడాలి" అని



అడిగాడు. కుమారుని తెచ్చి మహర్షికి చూపించాడు. మహర్షి ఆ పసిబిడ్డకు ప్రదక్షిణం చేసి కృతార్థుడనయ్యానని తృప్తి పడ్డాడు. "రాజా! నీ కుమారుడు ధర్మదేవతకు మారురూపం. ప్రపంచాన్ని ఉద్ధరించగల మహానుభావుడవుతాడు" అని పలికి ఆకాశమార్గంలో వెళ్ళిపోయాడు.

సిద్ధార్థుడు తన ఎనిమిదవ ఏటనే వేదాలు, పురాణాలు మొదలైన సకలవిద్యలు విశ్వామిత్రమహర్షి శుశ్రూషతో నేర్చుకున్నాడు. విశ్వామిత్రుడు ప్రారంభంలో గాయత్రీమంత్రం ఉపదేశించి విద్యలు బోధించాడు. ఏకసంతాగ్రాహియై విద్యలన్నీ అనతికాలంలోనే సిద్ధార్థుడు నేర్చుకున్నాడు.

**దయామూర్తి :**

సిద్ధార్థుని గుణాల్లో దయ ముఖ్యమైంది. ఒకనాడు బాలురతో ఆడుకుంటున్నాడు. దేవదత్తుడనేవాడు బాణంతో ఆకాశంలో పోతున్న హంసను కొట్టాడు. అది నేరుగా గిలగిలా తన్నుకుంటూ సిద్ధార్థుని సమీపంలో పడింది. చిన్నారి మనస్సు చివుక్కుమంది. హంసను తీసుకొని బాణాన్ని ఊడదీసి దానిని తన మృదువైన వ్రేళ్ళతో నిమురుతున్నాడు. దేవదత్తుడు వచ్చి

ఎంత ప్రయత్నించినా హంసను అతని చేతికివ్వలేదు. "చనిపోయిన జంతువు వేటగాని సొత్తు. ఇది బ్రతికి ఉంది. నేను దీన్ని రక్షిస్తాను. జీవహింస ఘోరమైన పాపం," అని వేటగానికి బోధించి పంపాడు. హంసకు తగిన చికిత్సచేసి వదలిపెట్టాడు. ఏ ప్రాణికైనా సరే ఆపదవస్తే సిద్ధార్థుని గుండె నీరైపోతుంది.

## వివాహం :

యుక్తవయస్సు రాగానే సిద్ధార్థునికి వివాహ ప్రయత్నాలు ప్రారంభించాడు శుద్ధోదనుడు. రాజబంధువులు కూడ "గౌతమునికి త్వరగా వివాహం చేస్తే రాజ్యమేలుతూ ప్రజలను రక్షిస్తాడు. అతని మనస్సు మామూలు దారికి వస్తుంది. ఇల్లు విడిచివెళ్ళే అవకాశం ఉండదు. విద్యాభ్యాసం కూడా పూర్తి అయింది. యుక్తవయస్సు వచ్చింది. అనురూప వతి, గుణవతి అయిన కన్యను తెచ్చి వివాహం చేయడం మంచిది" అన్నారు. ఈ వివాహ ప్రసక్తి సిద్ధార్థునికి వినిపించాడు తండ్రి. మొదట ఇష్టంలేకపోయినా తండ్రి ప్రేరణతో సిద్ధార్థుడు "తండ్రీ! నన్ను ప్రేమించే భార్యకు సత్యం, ధర్మం ప్రధాన



గుణాలుగా వుండాలి. అలాంటి కన్య లభిస్తే వివాహానికి నా కభ్యంతరం లేదు" అన్నాడు.

శుద్ధోదనుడు అపరిమితమైన ఆనందంతో అనుకూల వతియైన కన్యను వెదకడానికి ఏర్పాట్లు చేశాడు. మంత్రులు, పురోహితులు వధువును వెదకుతూ దేశాలు తిరుగుతున్నారు. తమకు నచ్చిన రాజకన్యలందరినీ రాజ ప్రాసాదంలో సమావేశపరచారు పురోహితులు. వారిలో యశోధర సహజ సౌందర్యవతి. అభిమానవతి. లలితకళలు ఆమె సొత్తు. ఆమె తోళీపట్టణం రాజు దండపాణి కుమార్తె. సిద్ధార్థుడు, యశో ధరను వివాహమాడటానికి సమ్మతించాడు.

సిద్ధార్థుడు దండపాణి ఎదుట ధనుర్విద్య, గుర్రపు స్వారి, జ్యోతిష్యం మొదలైన విద్యలన్నీ ప్రదర్శించాడు. సిద్ధార్థుని విద్యలన్నీ స్వయంగా పరీక్షించాడు దండపాణి. సంతోషించి తన కుమార్తె అయిన యశోధరను సిద్ధార్థునికిచ్చి అతి వైభవంగా వివాహం జరిపించారు. యశోధర దేవదత్తుని సోదరి. వివాహానంతరం సిద్ధార్థునికి మహాజనుల సమక్షంలో మంత్రపూర్వకంగా యువరాజ పట్టాభిషేకం జరిగింది.



## అంతర్మథనం :

సిద్ధార్థుడొకనాడు పురవైభవాన్ని చూడటానికి రథంపై కూర్చొని బయలుదేరాడు. కొంతదూరం వెళ్ళేసరికి వ్యాధితో బాధపడ్తున్న ఒక ముసలి వాడు అతని కంటపడ్డాడు. వెంటనే సారథిని పిల్చి 'ఇతడెవ్వడు? ఇతని స్థితికి కారణమేమి?' అని ఆసక్తితో అడిగాడు.

"దేవా! ఇతని స్థితి సర్వసామాన్యం. ఆబాలగోపాలం వయసు గతించే కొద్దీ ఈ స్థితికే వస్తారు. ఇది ప్రకృతి ధర్మం. మీ తల్లిదండ్రులు, మీరు కూడా చివరికి ముసలితనంలో జరాపీడితులై ఈ స్థితికే రావాలి" అని సారథి జన్మల నిజస్వరూపాన్ని అద్దంపట్టి చెప్పాడు. సిద్ధార్థుని మనస్సు కలుక్కుమంది. విహారం మానుకుని రథం వెనక్కి మళ్ళించాడు. నాటినుండి సిద్ధార్థుని మనస్సులో ఏదో తెలియని నిర్వేదం ఆరంభమైంది.

ఆ తర్వాత మళ్ళీ ఒకనాడు నగరదర్శనానికి బయలుదేరాడు సిద్ధార్థుడు. ఆ దినం ఒక రోగి, మరొక దినం ఒక శవం, వేరొకనాడు సన్యాసి వరుసగా కనిపించారు. వీరిని



చూడగానే సిద్ధార్థుడు చాల బాధపడి పరితపించాడు. తాను సర్వసంగపరిత్యాగం చేసి సన్యాసం స్వీకరించడానికి నిశ్చయించుకున్నాడు. "ప్రియురాలు ప్రేమ ఒక్కటే ముఖ్యం కాదు. ప్రపంచంలో ఎంతో మంది దీనులు, దరిద్రులు విచారంతో కృశించి నశించిపోతున్నారు. వెంటనే వెళ్ళి వారి కన్నీటిని తుడిచివెయ్యి. బుద్ధుడవై మందబుద్ధులను ప్రబుద్ధులుగా మార్చు"అని అంతర్వాణి పలికినట్లైంది.

## పుత్రోదయం :

సిద్ధార్థుని మనస్సు మనస్సులో లేదు. జనన మరణ దుఃఖాన్ని దాటే మార్గం అన్వేషించడం ప్రారంభించాడు. తాత్కాలికమైన సుఖభోగములపై అతని మనస్సు లయంకాలేదు. చిత్తశాంతి లభించలేదు.

ఇంతలో యశోధర ఒక ముద్దుల కొడుకును ప్రసవించింది. ఈ వార్త విన్న గౌతముని మనస్సు ఆనందించ లేదు. పుత్రజననం తనకొక రాహులమని (సంకెల అని) అన్నాడు. అందుకే ఆ బాలునికి 'రాహులు'డని పేరు పెట్టారు.

పుత్రోదయమైన శుభసమయాన్ని పురస్కరించుకొని యౌవనాంగులు నృత్యగానాలు చేశారు.

**మహాభినిష్క్రమణం :**

పుత్రోదయం సిద్ధార్థునికి ఒక బంధమైంది. ప్రపంచంలోనున్న ప్రాణుల కష్టాలను ఆలోచించే కొద్దీ అతని మనస్సుకు విశ్రాంతి లభించడం లేదు.

''బలవంతులు బలహీనులను హింసించడం సహించరాని కష్టం. మన్మథుని బాణాలను వెనక్కు మళ్ళించి కొట్టాను. నా మనోరాజ్యానికి నేనే చక్రవర్తిని. మనుష్యుల్లో మానవత్వాన్ని మేల్కొల్పుతాను. సత్యం తెలిసికొని ప్రపంచానికి చాటిచెబుతాను'' అని దృఢమైన సంకల్పంతో ఆ రాత్రి నిద్రించాడు.

అర్ధరాత్రివరకు నిద్రపట్టలేదు. దీపాలు సువాసన తైలంతో కాంతి ప్రసరిస్తున్నాయి. చుట్టూ పరివారజనం నిద్రపోతున్నారు. ఈ ప్రపంచం అశాశ్వతం. దానిపై రోత పుట్టింది. అంతఃపురంలో యశోధర పరిమళ పుష్ప శయ్యపై



శిశువును కౌగిలించుకొని గాఢనిద్రలో వుంది. ముద్దులుగారు బిడ్డను తాకడానికి మనస్సు ముందుకు దూకింది. ఆత్మను నిగ్రహించుకున్నాడు. కరుణాపూరితమైన కళ్ళతో భార్యా పుత్రులను చూశాడు. ఎలాగో అంతఃపుర బంధం తెంచుకొని బయటికి వచ్చేశాడు.

**దేవుడు లేని దేవాలయం :**

సారథిని పిలిచి ''ఛన్నా! మనం గొప్పకార్యం నిర్వహించాలి. ఒక గుర్రం తీసుకురా'' అన్నాడు. గౌతముని ఉత్సాహం చూచి చెన్నుడు మారుచెప్పలేదు. అశ్వాన్ని సిద్ధం చేశాడు. చెన్నుడు వెంటరాగా పురం వదలి ఆరోమా నదీతీరం చేరాడు. అక్కడ సిద్ధార్థుడు తన ఆభరణాలను విసర్జించాడు. అన్నీ మూటకట్టి చెన్నునికిచ్చి తిరిగి వెళ్ళమన్నాడు. చెన్నుడు దుఃఖాన్ని ఆపుకోలేక తానూ వెంట వస్తానని కాళ్ళపై పడ్డాడు. లాభంలేక తిరిగి కపిలవస్తునగరానికి వెళ్ళిపోయాడు.

సిద్ధార్థుడు కపిలవస్తుపురం వదలి వెళ్తుండగా ఆ నగరదేవత ''నీవు వీడిపోయిన ఈ నగరం దేవుడులేని దేవాలయం; దీనికింక వృద్ధి లేదు'' అని విలపించినట్లైంది.



చెన్నుడు వెళ్ళిన తర్వాత రాగకారణమని సిద్ధార్థుడు శిరోజాలు ఛేదించుకున్నాడు. కాషాయవస్త్రాలు ధరించాడు. భిక్షువేషధారి అయ్యాడు. వైశాలీ నగరమార్గం పట్టుకొని పోతున్నాడు. దారిలో శాక్య, పద్మ అనే ఇద్దరు బ్రాహ్మణ పత్నుల ఆతిథ్యం స్వీకరించాడు. తర్వాత బ్రహ్మర్షి అయిన రేవతుని ఆదరం పొందాడు. అక్కడే వైశాలీవాసుడైన 'అలారకలముడు' అనే పండితుని ఆశ్రయించాడు. కొన్నాళ్ళపాటు ఆయనకు శుశ్రూష చేసి యోగాభ్యాసం చేశాడు. అయినా తృప్తిలేక మగధరాజధానియైన రాజగృహానికి వెళ్ళాడు.

**దుఃఖసముద్రం :**

సిద్ధార్థుడు వెళ్ళిన తరువాత తెల్లవారింది. అంతః పురమంతా వెతికారు. ''హా నాథా! హా తండ్రీ! హా సోదరా!'' అనే హాహాకారాలు రాజభవనమంతా వ్యాపించాయి. సిద్ధార్థుడు కనిపించలేదన్న వార్తవినగానే శుద్ధోదనునికి మతిపోయింది. నగరద్వారాలన్నీ మూయించాడు. పెంచిన తల్లి గౌతమి స్పృహ తప్పి పడిపోయింది. దిక్కుదిక్కులకు గుర్రపు రౌతులను వెదకడానికి పంపించాడు. ఇంతలో చెన్నుడు నగరం ప్రవేశించి



జరిగినదంతా విన్నవించాడు. మహారాజు దుఃఖం నదీప్రవాహం లాగా కట్టలు తెంచుకొని ప్రవహించింది. యశోధర శోక దేవతలా గుండె బాదుకొని ఏడ్చింది. ''అమ్మా! నీ భర్త లోకహితార్థం వెళ్ళాడు. మీరు విచారించకండి'' అని యశోధరను ఓదార్చారు.

**భిక్షాటన :**

రాజగృహవీథుల్లో భిక్ష ప్రారంభించాడు సిద్ధార్థుడు. భిక్షువేషం ధరించిన అతనిలో మహాపురుషలక్షణాలు అందరినీ ఆకర్షించాయి. అతడు మానవమాత్రుడో? దేవదూతయో? గుర్తుపట్టలేకపోయారు. సిద్ధార్థుని భిక్షాటన విని బింబిసార మహారాజు దర్శనానికి వచ్చాడు. స్వామిని దర్శించి జన్మ తరించిందనుకున్నాడు. ''మహానుభావా! మీ దర్శనభాగ్యంతో ధన్యుడనైనాను. మీకు నా సర్వసామ్రాజ్యాన్ని అర్పిస్తాను. రాజభవనానికి విచ్చేసి పావనం చేయండి'' అని ప్రార్థించాడు. సిద్ధార్థుడు రాజు ఆహ్వానాన్ని మన్నించలేదు. ''బింబిసార మహారాజా! నేను బుద్ధుడనై తిరిగి వచ్చే సమయంలో మొదటి సారిగా మీ రాజ్యానికే వస్తాను'' అని మాట ఇచ్చాడు.

అచటినుండి 'ఉరువేలా' ప్రాంతం చేరాడు. తిరిగి తిరిగి వేసారాడు. ఆ ప్రాంతంలో ఒక చెట్టునీడన విశ్రమించాడు. ఎంతో ప్రశాంతమైన ఆ చోటును సాధనభూమిగా నిర్ణయించుకున్నాడు.

**కఠోర తపస్సు :**

సిద్ధార్థుడు భోజనం మానివేశాడు. ఎండ, వాన, చలి కూడ లెక్కచేయక కఠోర తపస్సు చేయసాగాడు. ఆ తపస్సు ఆరు సంవత్సరాలు సాగింది. భయంకరమైన తపస్సుచే శరీరం శుష్కించిపోయింది. అస్థిపంజరమైంది. తెలివితప్పి క్రింద పడిపోయాడు. తపస్సుకు ఫలితం దక్కలేదు.

శరీరం శుష్కించిపోయే తపస్సు చేయడంవల్ల లాభం లేదని ఆ తపస్సును విరమించాడు. పెరుగన్నం తినడం మొదలుపెట్టాడు.

**అన్నంలో అమృతం పోశావా!**

సుజాత ఒక మహాపతివ్రత. ఆమె భర్త సేనాని. వారికి సంతానం లేదు. సమీపంలోని వనదేవతను ఆరాధించింది



సుజాత. పుత్రోదయమైతే మధుర పాయసాన్నంతో నైవేద్యం పెడతానని మ్రొక్కుకుంది. ఆమె నోము ఫలించి అచిర కాలంలో సుజాతకు పుత్రోదయమైంది. బాలునికి మూడవ నెల వచ్చింది. వనదేవతకు మొక్కు చెల్లించాలి కదా! బంగారు పాత్రల్లో పిండివంటలు, అన్నం తీసుకొని వచ్చింది. వన దేవతాలయం ప్రక్కన ధ్యాన నిమగ్నుడై వున్న సిద్ధార్థుని చూచింది. ఆ మహాతేజస్విని చూడగానే ఆవిడ ఆశ్చర్యంతో నిల్చిపోయింది. వనదేవత సిద్ధార్థుని రూపంలో వచ్చిందని భావించింది. తాను తెచ్చిన నైవేద్యం స్వామికి సమర్పించింది. ఆ ఆహారం భుజించి బ్రహ్మానందభరితుడయ్యాడు సిద్ధార్థుడు.

''అమ్మా! నాకు విందుభోజనం పెట్టి ఆనంద పరిచావు. నీ నైవేద్యం ఆరగించడంవల్ల నాలో నూతనోత్సాహం కల్గింది. శుష్కించిన శరీరం బలం పుంజుకుంది. మహాసాధ్వివి. నీ ఆహారంలోని మాహాత్మ్యం చాలా గొప్పది. ఈ భోజనంలో అమృతం పోశావా'' అని ప్రశంసించాడు. ''తల్లీ! సంసారబంధం కంటే ఉత్తమమైన ధర్మం ఇంకొకటి లేదా ప్రాణికి?'' అని ప్రశ్నించాడు.





దానికి సుజాత ''అయ్యా! నేను ఇల్లాలిని. పతియే సతులకు పరమదైవం. ఇహపరసౌఖ్యాలు ప్రసాదించేది భర్తమందిరమే. దానం, ధర్మం, ఇతరులకు హితం చెప్పడం, పతిసేవ స్త్రీ జీవితలక్ష్యాలు. పతిసేవలో స్వర్గసౌఖ్యాలు అనుభవించడం భారత స్త్రీ జీవితధర్మం'' అని పలికింది. గౌతముడు సవినయంగా ''అమ్మా! నీవు మహాజ్ఞానివి'' అని ఆమెకు నమస్కరించాడు. అక్కడనుండి బయలుదేరి గయ సమీపానికి చేరాడు.

**మహాబోధివృక్షం :**

సుజాత బోధ, సిద్ధార్థుని పరిస్థితి గమనించిన శిష్యులు అయిదుగురు గురువును వ్యతిరేకించారు. సిద్ధార్థుని మనస్సు చంచలమైనదని భావించి వారు కాశీకి వెళ్ళిపోయారు.

శిష్యులు వెళ్ళిన తర్వాత సిద్ధార్థుడు నిరంజన నదీతీరం చేరాడు. అశ్వత్థవృక్షం క్రింద నిశ్చలంగా కూర్చున్నాడు. ఆ వృక్షం తర్వాత మహాబోధివృక్షమని ప్రసిద్ధి చెందింది.

20

## జ్ఞానోదయం :

తపస్సు వల్ల లాభం లేదు. దేహం శుష్కించడం వల్ల ప్రయోజనం లేదు. ఈ అనుభవవాదం మనసులో మోసు లెత్తింది. ఆ సమయంలో మన్మథుని బాణాలు అయిదూ ఒక్క సారిగా సిద్ధార్థుని ఆవేశించాయి. కానీ అతని స్థైర్యం, ధైర్యం, నిగ్రహం మోహతరంగాలన్నింటినీ జయించాయి. ధ్యాన సమాధిలో మునిగిపోయాడు.

ఏకాగ్రచిత్తుడై సిద్ధార్థుడు గావించిన ధ్యానం పూర్తిగా ఫలించింది. ఆ దీక్షలో జ్ఞానోదయమైంది. సృష్టిరహస్యం గోచరించింది. సత్యం, ధర్మం అనే అమృతం అతని హృదయం నుండి జాలువారింది. సిద్ధార్థుడు బుద్ధుడయ్యాడు.

అనర్థాలన్నింటికీ మూలం అవిద్య (అజ్ఞానం). దాన్ని నాశనం చేయాలంటే పవిత్ర మతం, పవిత్ర భావం, పవిత్ర కార్యం, పవిత్ర వాక్యం, పవిత్ర జీవితం, పవిత్ర చేష్ట, పవిత్ర చింతన, పవిత్ర స్మృతి అనే ఎనిమిది సూత్రాలను అవలంబించాలని గ్రహించాడు.

21

## ఎన్ని జన్మల ఫలమో! :

బుద్ధుడు కాగానే అతని పూర్వజన్మలు వరుసగా జ్ఞప్తికి వచ్చాయి. భూత భవిష్యద్వర్తమానకాలిక జ్ఞానం వెల్లివిరిసింది. చావుపుట్టుకలనుండి తప్పించుకునే చక్కని సాధనలు మనస్సుకు గోచరించాయి. బుద్ధుని చింతలన్నీ తీరిపోయాయి.

"ఎన్ని జన్మల ఫలమో! ఈనాటికి పరమసత్యం నాకు గోచరించింది. శరీరాన్ని కృశింపజేయకుండా ధ్యానసాధనతో సిద్ధి పొందవచ్చు" అనే మాటలు ప్రప్రథమంగా బుద్ధుని నోట వెలువడ్డాయి.

గౌతముడు బుద్ధుడైన సమయంలో ప్రకృతి సంతోషంతో పులకించింది. పులి-మేక ఒక చెరువులో నీరు త్రాగడం సంభవించింది. నెమళ్ళు, పాములు స్నేహంతో నృత్యం చేయడం ప్రారంభించాయి. ప్రపంచమంతా అన్యోన్య మైత్రితో ప్రేమమయంగా తోచింది. దేవతలు, గంధర్వులు, కిన్నరులు, కింపురుషులు బుద్ధుని కొనియాడారు. బుద్ధునిపై పుష్పవృష్టి కురిపించారు.

22

## ధర్మప్రచారం :

తాను గ్రహించిన సత్యాన్ని మొట్టమొదట ఎవరికి బోధించాలి? అనే ప్రశ్న బుద్ధునికి ఎదురైంది. శుద్ధమైన మనస్సుతో సుస్వరంతో ప్రచారం చేసి బోధింపగల సరియైన శిష్యుడెవడు? అని ఆలోచిస్తూ కాశీ చేరాడు. అక్కడ తన మొదటి అయిదుగురు శిష్యులను కలుసుకొన్నాడు. బుద్ధుని చూడగానే ఆ తేజోమూర్తి పాదాలపై బడి వారు నమస్కరించారు. వారి ద్వారా తన నూతన ధర్మచక్రప్రవర్తన చేయాలని సంకల్పించాడు బుద్ధుడు. వారి సందేహాలు పోగొట్టాడు.

**సర్వం దుఃఖం.... సంసారం దుఃఖమయం.**
**సర్వం క్షణికం.... ప్రతిపదార్థం క్షణికమే.**
**సర్వం స్వలక్షణం... దేని లక్షణం దానికే.**
**సర్వం శూన్యం.... అంతా సున్న.**

అనే సిద్ధాంతాలు చాటాడు. బుద్ధుడు అయిదుగురు శిష్యులకు సన్న్యాస దీక్షనిచ్చాడు. దానితో కాశీలో బౌద్ధధర్మ ప్రచారం ప్రారంభమైంది.



**శుద్ధోదనుని పుత్రాన్వేషణ :**

గౌతముడు వెళ్ళినది మొదలు అతని జాడ తెలియక పుత్రవియోగంతో శుద్ధోదనుడు కుమిలిపోతున్నాడు. కోడలు యశోధర బాధ చూసి భరింపలేకున్నాడు. కుమారుని వెదకటానికి మళ్ళీ వేగులను నలుదిక్కులకు పంపించాడు.

రాహులునికి ఏడు సంవత్సరాలు నిండాయి. ముద్దులు గార ఆడుకుంటున్నాడు. సిద్ధార్థుడు కూడా చిన్న వయస్సులో అట్లే ఉండేవాడు. యశోధర బాలుని ఆటలు చూస్తూ భర్తను జ్ఞాపకం చేసుకుంటూ తనలో తాను దుఃఖాన్ని దిగమ్రింగుకుంటుంది.

ఇంతలో ఒక సఖివచ్చి 'అమ్మా! మన వర్తకులు యువరాజును కళ్ళారా చూచి వచ్చారట' అని యశోధరకు చల్లనివార్త చెప్పింది. ఈ శుభవార్త విన్న యశోధర ఆనందం మాటలకు అందనిది. వెంటనే వ్యాపారులను పిలిపించి భర్తజాడను విచారించింది. "గయకు సమీపంలో ఒక వనంలో సిద్ధార్థుని చూశాం. ఆయన ప్రస్తుతం బుద్ధావతారంలో ఉన్నాడు.



రాజులు మొదలుకొని సామాన్యుల వరకు అందరు ఆయన శిష్యులై సేవలు చేస్తున్నారు". అంటూ వ్యాపారులు సంతోషంగా మనవిచేశారు.

శ్రవణానందకరమైన ఈ వార్త విని పరవశించింది యశోధర. మామగారి కీ విషయం చెప్పింది. భర్తను తక్షణం పిలిపించమని ప్రార్థించింది. శుద్ధోదనుడు తన స్థితి, యశోధర పరిస్థితి, రాహులుని క్షేమాలు భటుల ద్వారా చెప్పి పంపించాడు.

**ధర్మప్రతిజ్ఞలు :**

బింబిసారమహారాజు బుద్ధుని కీర్తిని, శక్తిని విని శిష్యులతో తన అంతఃపురానికి రమ్మని ఆహ్వానించి, విందు ఏర్పాటు చేశాడు.

బుద్ధుడు భార్యాభర్తలను విడదీస్తున్నాడనీ, ఎంతో భవిష్యత్తుగల యువకులను భిక్షువులుగా మారుస్తున్నాడనీ మగధలో విమర్శలు చెలరేగాయి. ఈ విమర్శలు బుద్ధుని చెవికి వచ్చాయి. వారందరికీ బౌద్ధమత ప్రతిజ్ఞలు వినిపించాడు.



సత్యప్రభావంతో అందరూ పవిత్రులవుతారని బోధించాడు. దశ విధ బౌద్ధధర్మ ప్రతిజ్ఞలు వినిపించాడు.

**బౌద్ధమత ప్రతిజ్ఞలు :**

1. జీవహింస చేయను.
2. దొంగతనం చేయను.
3. వ్యభిచారం చేయను.
4. అసత్యమాడను.
5. మత్తుపదార్థాలు సేవించను.
6. అకాలభోజనం చేయను.
7. నృత్యగీతాదుల దర్శన శ్రవణాలను చేయను.
8. విలాసాలకు పరిమళ ద్రవ్యాలను వాడను.
9. ఉన్నత ఆసనం, ఉన్నత శయ్యను కోరను.
10. అవిద్యను నిర్మూలిస్తాను.

**కపిలవస్తుపుర ప్రవేశం:**

శుద్ధోదనుడు పంపిన భటులు బుద్ధుని దర్శించారు. ఆ బోధలు వింటూ అక్కడే నిలిచిపోయారు. వచ్చిన పని



మరచిపోయారు. శుద్ధోదనుడు ఆందోళనతో ఆత్మీయుడైన ఉదయనుడు అనే వానిని పంపించాడు.

ఉదయనుడు వెళ్ళి బుద్ధుని చూచి తండ్రివర్తమానం అందించాడు. బుద్ధుడు కపిలవస్తుపురానికి శిష్యులతో బయలుదేరాడు.

బుద్ధుని రాక విని కపిలవస్తుపుర వీథులన్నీ బాగా అలంకరించారు. తన ప్రభువును చూడటానికి ప్రజలంతా ఒళ్ళంతా కళ్ళు చేసుకొని చూస్తున్నారు. బుద్ధుని తీసుకు రావడానికి శుద్ధోదనుడు ముత్యాల పల్లకి పంపించాడు. పొలిమేరనుండి బుద్ధుని అడుగులకు మడుగు లొత్తడానికి సేవకులను నియమించాడు. పూలు దోసిళ్ళతో చల్లడానికి పరిచారికలను ముందే నియమించాడు.

బుద్ధుడు ఇంకా తన కుమారుడు గౌతముడుగానే భావించి మురిసిపోతున్నాడు ముసలిరాజు. బుద్ధుడు ఈ ఆడంబరాలను తృణప్రాయంగా భావించాడు. వాటి వైపు కన్నెత్తి కూడా చూడలేదు.

జగద్గురువు బుద్ధదేవుడు పురప్రవేశం చేశాడు. దారిపొడవునా పల్లె ప్రజలు స్వామికి స్వాగతం పలికారు. తండోపతండాలుగా ఆబాలగోపాలం తరలివచ్చింది. పురం నిండిపోయింది.

శుద్ధోదనుడు కుమారుని చూడగానే ఒళ్ళు తెలియని సంతోషంతో కౌగిలించుకున్నాడు. ముద్దుపెట్టుకున్నాడు. ఆనందబాష్పాలు రాల్చాడు. బుద్ధుడు తండ్రిని ఓదార్చాడు. తన కాళ్ళపై పడిన భార్యను, కుమారుని లేవనెత్తి హత్తుకున్నాడు.

శుద్ధోదనుడు కన్నీరు కారుస్తూ 'నాయనా! నీపై పెంచుకున్న ఆశలు నిరాశ చేశావు. కాటికి కాళ్ళు చాచే వయస్సు వచ్చింది నాకు. శోకదేవతైన నీ భార్యను కరుణించు. చిరంజీవి రాహులునిపై వాత్సల్యం చూపించు. రాజ్యభారం వహించు' అని బ్రతిమలాడాడు.

## అష్టాంగమార్గం :

బుద్ధుడు తండ్రి అమాయకపు మాటలకు నవ్వి "తండ్రీ! నేను బుద్ధుడనయ్యాను. ఆత్మానందానికి చక్కని



మార్గం బోధించడమే నా ధర్మం. నేను తెలుసుకున్నది అష్టాంగమార్గం, మంచి మార్గం, మంచి జ్ఞానం, మంచి భాషణం, మంచి ప్రవర్తన, మంచి స్థితి, మంచి ప్రయత్నం, మంచి ధైర్యం, మంచి వృత్తి ఇవే దుఃఖాన్ని పోగొట్టు మంచి మార్గాలు" అని యశోధరకు, శుద్ధోదనునికి బోధించాడు. "శీలం మానవులకు శ్రీరామరక్ష. శీలంలేని సంఘం నాశనం కావడం నిజం. దుశ్శీలుడు జంతువుల కంటే హీనుడు. అట్టి వాని జీవనం సర్వం దుఃఖమయం" అని అందరి ఆత్మలను మేలుకొల్పాడు.

కుమారుని మధురవాక్కులకు తండ్రి తన్ను తాను మరచి పొంగిపోయాడు. కుమారునితోపాటు యశోధర, శుద్ధోదనుడు బుద్ధునికి శిష్యులయ్యారు. బుద్ధుడు తన్ను పెంచిన గౌతమికి కూడ ధర్మదీక్ష ఇచ్చాడు.

## నందుడు :

గౌతమి కుమారుడు నందుడు. కొత్త పెళ్ళికొడుకు. అతణ్ణి సంసార దుఃఖ బంధం నుండి తప్పించాలి. బుద్ధుడు ఆలోచించాడు. నందుని ఇంటి దగ్గరకు వచ్చి భిక్ష కోరాడు.



అతడు భార్యాలోలుడు. కామానికి దాసుడు. అన్న పిలుపు విన్నాడు. బయటికి వచ్చాడు. భిక్షకు ఆహ్వానించాడు. కానీ భిక్ష నిరాకరించాడు బుద్ధుడు. తన వెంట రమ్మని సంజ్ఞచేశాడు. కారణం చెప్పలేదు. అడగటానికి భయపడ్డాడు నందుడు. మారుమాటాడక అన్నవెంట బయలుదేరాడు. బౌద్ధారామం చేరిన తర్వాత బుద్ధుడు ఇలా బోధించడం ప్రారంభించాడు.

## లోకానికి నీసేవ కావాలి :

"తమ్ముడూ! నీవు దయాసముద్రుడవు. దిక్కులేని వారిని రక్షించడమే నీ కర్తవ్యమనీ, బౌద్ధధర్మలతలను పెంచి పెద్దచేస్తావనీ-కొండంత ఆశతో ఎదురుచూశాను. ఆశించాను. నీవు కేవలం కామాతురుడవు కావడం ధర్మమా? ఇక్కడున్న బౌద్ధభిక్షువులను చూడు. తనతోడిదే లోకమని ప్రేమించి పెంచిన ఒక తల్లికుమారుడితడు. మమతను తెంచి వచ్చాడు. మొన్ననే పెళ్ళి అయిన యువకుడతడు. కామాన్ని జయించి వచ్చాడు. అదిగో ఆ వృక్షచ్ఛాయలో ధ్యాన నిమగ్నుడైన భిక్షువును చూడు. అతడు మొన్న మొన్ననే సింహాసనమెక్కిన యువరాజు.



రాజ్యకాంక్ష వదలివచ్చాడు. వీరంతా సంసార భవబంధాల్ని తెంచుకొని వచ్చి శాంతచిత్తులై ఉన్నారు. ధర్మదేవత పాదాలు ఆశ్రయించారు. చూశావా! తమ్ముడూ! పాపపంకిలమైంది ఈ ప్రపంచం. మృగాలు పచ్చిక తిని, గుక్కెడు నీరుతాగి ప్రాణాలు నిల్పుకుంటున్నాయి. కానీ ఈ మానవులు జానెడుపొట్టకోసం ఎన్నో చేయకూడని పనులు చేసి, ఆశలు పెంచుకుని-ఈ ప్రపంచాన్ని నరక సమానం చేస్తున్నారు. ఆకలి అయితే పులి తన సంతానాన్ని తానే తిని పొట్టనింపుకుంటుంది. మానవులు అలా కాదు. స్వార్థంతో రాక్షసులై ఇతరుల సంతానాన్ని కబళిస్తున్నారు. హింసామయమైన జగత్తును దయతో కాపాడటానికి నీలాంటి యువకుల సేవ ఎంతో అవసరం" అని సాధుజీవనం ఉత్తమోత్తమమైందనీ మనసుకు నచ్చేటట్లు ఉపదేశించి నందునికి దీక్ష ఇప్పించాడు బుద్ధుడు.

ఆ తర్వాత ఆమ్రవనంలో కొంతకాలం నివసించాడు. బంధువులైన ఆనందుడు, దేవదత్తుడు ముఖ్యశిష్యులయ్యారు. ఆనందుడు బుద్ధుని నిర్యాణం వరకు భక్తిశ్రద్ధలతో గురువును అంటిపెట్టుకొని ఉన్నాడు. తన జీవితం తరింపచేసుకున్నాడు.

దేవదత్తుడు బుద్ధుని శక్తి చూసి ఈర్ష్యపడ్డాడు. శత్రువయ్యాడు. హత్యచేయడానికి కూడ ప్రయత్నించాడు. హంతుకులు బుద్ధుని సౌజన్యమూర్తిని చూసి పరివర్తన చెంది స్వామి పాదాలను ఆశ్రయించారు. పశ్చాత్తాపంతో తిరిగి వెళ్ళిపోయారు.

**ఆమ్రపాలిక :**

సంచారం చేస్తూ బుద్ధుడు వైశాలీ నగరానికి వచ్చాడు. ఆ నగరం చివర మామిడి తోటలో విడిది చేశాడు. ఆ తోట ఆమ్రపాలిక అనే నర్తకికి స్వంతం. బుద్ధభగవానుడు తన తోటలో విడిదిచేయడం చాలా అదృష్టంగా భావించింది ఆమ్రపాలిక. స్వామిని విందుకు పిల్చింది. అంగీకరించాడు. స్వామి.

అంతకు ముందే వైశాలీనగర మహారాజు భిక్షకు ఆహ్వానించాడు. భగవానుడు తిరస్కరించాడు. రాజు ఆమ్రపాలి కను సమీపించి “నర్తకీ! కావలసినన్ని రత్నరాశులు ఇస్తాను. నీ భిక్ష మానుకొని, స్వామి నా భిక్ష స్వీకరించేటట్లు ఒప్పించు” అని ప్రాధేయపడ్డాడు. “రాజా! నీ సామ్రాజ్యం సర్వం నాకు



ధారపోసినా సరే-నేను నా భిక్షను వదులుకోను” అన్నది నర్తకి. స్వామికి ఆమ్రపాలి విందు చేసింది. ఆ తర్వాత తన తోటను బుద్ధునికి దానం చేసింది. తానూ బౌద్ధం స్వీకరించింది.

ఈ విధంగా దేశసంచారం చేస్తున్నాడు బుద్ధుడు. ఎందరెందరో పండితులు ఎదురయ్యారు. పూర్వజన్మల గూర్చి వాదప్రతివాదాలు జరిగాయి. ఎన్నో జాతక కథలను చెప్పి అందరినీ ఒప్పించాడు.

**అంగుళీమాలుడు :**

కోసలదేశం వచ్చాడు బుద్ధుడు. అక్కడ ఒక పురోహితుని కుమారుడు, చెడ్డసహవాసంతో దొంగగా మారి పోయాడు. త్రోవలు కొట్టి జీవిస్తున్నాడు. ప్రయాణికులను దోచుకొని వారి వ్రేళ్ళ నరికి దండగా గ్రుచ్చుకునేవాడు. అందు వలన వానికి అంగుళీమాలుడు అని పేరు వచ్చింది.

బుద్ధుడు అంగుళీమాలుని వనం ప్రవేశించాడు. ఆ వనంలోనికి వెళ్ళేటప్పుడు గుంపులు గుంపులుగా వెళ్ళ వలసిందే. ఒంటరిగా వెళ్ళటానికి అందరూ భయపడేవారు. అందువల్ల ఆ దారిలో వెళ్ళవద్దని బుద్ధునికి పశువుల కాపరులు



విన్నవించారు. అయినా వినలేదు. వారిమాట లెక్కచేయక ఆ మార్గంలోనే బుద్ధుడు ప్రయాణం సాగించాడు.

అంగుళీమాలుడు బుద్ధుని చూశాడు. అతడు బుద్ధుని సమీపించడానికి వస్తున్నాడు. బుద్ధుడాతనికి చిక్కకుండ నడచిపోతున్నాడు. అంగుళీమాలుడు ఎంత వేగంగా వెంబడించినా బుద్ధుడు చిక్కడంలేదు. దొంగ అలసిపోయిన వాడై నిలువమని గర్జించాడు. అప్పుడు బుద్ధుడు నిలిచి దొంగను చేరదీసి “నాయనా! సమస్త భూతములయందు దయగల్గియున్నచో నీకు నరకబాధ తప్పుతుంది” అని గంభీరంగా పలికాడు. అంగుళీమాలుడు బుద్ధుని తేజస్సు చూసి అట్లే నిలిచిపోయాడు. ఆ మాటలలోని సత్యం అతణ్ణి బాగా ఆకర్షించింది. పశ్చాత్తాపంతో రక్షించమని కాళ్ళపైబడి ప్రార్థించాడు. బుద్ధుడు కరుణతో అతనికి దీక్షను ఇచ్చాడు. అంగుళీమాలుడు బౌద్ధభిక్షువుల్లో ఉత్తముడుగా కీర్తింపబడ్డాడు.

**పతినే పూజిస్తా :**

మరొకనాడు బుద్ధుడు భిక్షకు వెళ్తుండగా ఒక ఇంటిలో కలకలం విన్పించింది. ఆ ఇంటి గుమ్మం దగ్గర నిలబడ్డాడు స్వామి. ఇంటి యజమానిని పిల్చి కారణం తెలుసుకున్నాడు.



ఆ ఇంటి కోడలు భాగ్యవంతుని కుమార్తె. మగని మాటలు లెక్కపెట్టదు. గయ్యాళిగంప. అత్తమామలను గౌరవించదు.

బుద్ధుడా కోడలిని పిల్చి “బిడ్డా! మగవానికి ఏడుగురు భార్యలు. ఒకరు హంతకురాలు, రెండవది దొంగ, మూడవది ఉంపుడుగత్తె, నాలుగవది తల్లి, ఐదవది తోబుట్టువు, ఆరవది స్నేహితురాలు, ఏడవది దాసి, పైవారిలో నీవు ఏ తెగకు చెందినదానివి?” అని ప్రశ్నించాడు. ఆ మాటలకు కొత్త కోడలు సిగ్గుపడ్డది. బుద్ధుని వచోమాధుర్యానికి పూర్తిగా మారి పోయింది. “దేవా! ఈ దినం నుండి నా భర్తకు దాసిగా సేవలు చేస్తాను. పతియే ప్రత్యక్షదైవమని పూజిస్తాను” అని ప్రమాణం చేసింది. బుద్ధుడు ఆవిడకు జ్ఞానోదయం కల్గించి వెళ్ళాడు.

భిక్షకు వెళ్లిన మార్గంలో అడ్డుతగిలిన వారికందరికీ ఎన్నెన్నో నీతులు కథలద్వారా బోధించాడు. తెలివితేటలతో తమ అధికారి విషయంలో నమ్మకంగా ప్రవర్తించాలి. ఒళ్ళంతా కళ్ళుపెట్టుకొని ఇతరులకు సహాయం చేయాలి. తన రక్షణ కోసం శత్రువుల సహాయం కూడా కోరాలి. ఎంత ధైర్య

వంతుడైనా మెలకువతో మెలగాలి. మంచి స్నేహితులనే ఆశ్రయించాలి. అలాంటి వారిని ఎవ్వరూ మోసం చేయలేరు. ఇవన్నీ బుద్ధుడు జాతకకథల నుండి నేర్పిన నీతులు.

## స్త్రీలకు బౌద్ధమతం :

మొట్టమొదట స్త్రీలకు తన మతం యోగ్యంకాదని నిరాకరించాడు బుద్ధుడు. తర్వాత ప్రియశిష్యుడైన ఆనందుని ప్రోత్సాహంతో పెంచిన తల్లి గౌతమికి దీక్ష ఇచ్చాడు. తర్వాత పట్టపురాణి 'క్షేమ' బౌద్ధం పుచ్చుకుంది. అట్లే సుజాత జీవితంపై రోతపుట్టి శిష్యురాలైంది. చివరికి బుద్ధుని భార్య యశోధర బౌద్ధమత మహిళా మండలికి నాయకురాలైంది. తమ్ముడు నందుని భార్య సుందరికూడ బౌద్ధం స్వీకరించింది.

ఎల్లప్పుడు సత్యం పలుకుతూ, హింస చేయక పోవడం, చిత్తశాంతి కలిగి కోపతాపాలను అణచుకోవడం, పరులకు హితం పలకడం బ్రాహ్మణుల పరమధర్మాలని సెలవిచ్చాడు బుద్ధుడు. ఎంత గొప్పవాడైనా, పండితుడైనా శాంతము లేక సౌఖ్యం లేదు కదా!



## ధర్మప్రబోధం :

"కర్మఫలితాన్ని మానవుడు తప్పక అనుభవించాలి. ఇది సర్వమత సిద్ధాంతం. ఒక చేత చేసిన పాపం మరొకచేత అనుభవించి తీరాలి. పూర్వ జన్మలో చేసుకున్న పుణ్యం ప్రస్తుత జన్మలోని పాపభారాన్ని తగ్గిస్తుంది. మనం అనుభవించే పుణ్యపాపాలు పూర్వజన్మఫలితాలు. భూతదయగల మనుష్యుడే పవిత్రుడు. అపకారికి ఉపకారం చేసి అతని తప్పు తెలియజేయాలి. శత్రువును ప్రేమతో చేరదీయాలి. అప్పుడే శత్రువు మిత్రుడుగా మారి ఆనందం కల్గిస్తాడు. తన్ను తాను జయించిన తర్వాత బయటి శక్తులను జయించడానికి ప్రయత్నించాలి. సత్యవాక్యపాలకులకు దివ్యదర్శనం లభిస్తుంది. మూఢభక్తిని, మూఢవిశ్వాసాలను ఖండించాలి. హింసతో కూడిన యజ్ఞాలను నిరసించాలి. చీమ కోసమైనా సరే జీవితం అర్పించడానికి సిద్ధంగా ఉండాలి. కులభేదం సుతరాము పనికిరాదు.

ధనికుడు, దరిద్రుడు, అగ్రజాతివాడు, తక్కువ జాతివాడు, అందరూ ఒక్కటే. నదులన్నీ సముద్రంలో



కలిసిపోయినట్లే అన్ని జాతులూ మతాలూ, బౌద్ధమతంలో కలుస్తాయి. భగవంతుడున్నాడా లేడా? అనే వాదంతో కాలం వృథా చేయకూడదు. ప్రేమదానం చేయాలి. సత్యాన్ని అన్వేషించాలి" అని ఎన్నో సూక్తులు వల్లించాడు. ద్వేషంతో సమానమైన పాపం లేదని ప్రచారం చేశాడు.

## నిర్యాణం :

పై విధంగా బోధచేస్తూ జీవితకాలమంతా గడిపాడు బుద్ధుడు. ఎనభై సంవత్సరాలు నిండాయి. వృద్ధాప్యం బాగా వచ్చింది. శ్రావస్తి నుండి రాజగృహానికి తిరిగి వచ్చాడు. గృధ్రకూట పర్వతంపై కొంతకాలం వున్నాడు. శిష్యులకు నిర్వాణమార్గాలన్నీ బోధించాడు. శిష్యసమూహంతో అక్కడ నుండి నలందా వెళ్ళాడు. అక్కడ నుంచి పాటలీపురం ప్రవేశించాడు. వెళ్లినచోట ఎదురైన వారందరికీ సుఖదుఃఖాలను గూర్చి వివరించాడు.

పాటలీపురాన్ని వదలి గంగానది దాటి కోటిగ్రామం చేరుకున్నాడు. అలాగే ప్రయాణం చేసి మళ్ళీ వైశాలీనగరం



చేరాడు. ఆమ్రపాలి ఇచ్చిన తోటలో విడిది చేశారు. శిష్యులందరినీ వైశాలీ పరిసర ప్రాంతాలకు పంపివేశాడు. ముఖ్య శిష్యుడైన ఆనందునితో బేలువా విహారంలో నివాసం ఏర్పరచు కున్నాడు. అక్కడే బుద్ధునికి జబ్బు చేసింది. తనకు నిర్యాణం సమీపిస్తుందని గ్రహించాడు.

"శిష్యులారా! ఒక్కొక్కరు ఒక్కొక్క జ్యోతిగా మారి లోకానికి సత్యం బోధించండి. ఆత్మాశ్రయాన్నే పొందండి. భౌతికమైన ఏ వస్తువునూ ఆశ్రయించకండి" అని చివరి సందేశం ఇచ్చాడు.

## అమృతవాక్కులు :

ఆనందునితో బయలుదేరి పావా నగరం చేరాడు. అక్కడ ఒక కుమ్మరివాని ఇంట భుజించి మళ్లీ కుశినగరానికి బయలుదేరాడు. మార్గ మధ్యంలో అతిసారరోగానికి గురి అయినాడు. సాలవనం చేరాడు. ఆనందుడు నిర్మించిన శయ్యపై పడుకున్నాడు. ఆ రాత్రి ప్రియశిష్యుని పిలిచి "కుమారా! ఆనందా! ఈ రాత్రి చివరి గడియలో నా నిర్యాణం" అని పలికాడు.

**బుద్ధం శరణం గచ్ఛామి.**
**ధర్మం శరణం గచ్ఛామి.**
**సంఘం శరణం గచ్ఛామి.**

అనే అమృతవాక్కులు కడసారిగా బుద్ధదేవుని నోటి నుండి బయటికి వచ్చాయి.

బుద్ధుని దివ్యజ్యోతి అనంత విశ్వంలో లీనమైంది. అతని ఆత్మ నిత్యశాంతిమయమైన స్వరూపంగా నిల్చిపోయింది.

**ఓ కారుణ్యము రూపుగొన్న సుకృతీ!**
**యోగీంద్ర చారిత్రరే**
**ఖా కిమ్మీరము నీదు జీవితము; శు**
**ష్కప్రేమ కాకోల మౌ**
**శోకంబున్ పరిమార్చు మార్గములనే**
**శోధించి బోధించి - ఆ**
**లోకాతీత పదంబు జేరితివి సు**
**శ్లోకుండవై గౌతమా!**



అని లోకమంతా కీర్తించింది. బుద్ధుని జీవితం మానవతకు మణిదర్పణం.

**బుద్ధుని పేర్లు :**

**సర్వజ్ఞుడు:** సర్వము తెలిసినవాడు.

**సుగతుడు:** తిరుగులేని మోక్షపదము నందినవాడు.

**ధర్మరాజు:** అహింసా ధర్మమునకు రాజు.

**తథాగతుడు:** అపేక్షించిన దానిని పొంది తిరిగి వచ్చిన వాడు.

**భగవంతుడు:** జ్ఞానం, బలం, ఐశ్వర్యం, వీర్యం, శక్తి, తేజస్సులు కలవాడు.

**లోకజిత్తు:** తపస్సుతో లోకాన్ని జయించినవాడు.

**జినుడు:** సంసార బంధమును జయించినవాడు.

**షడభిజ్ఞుడు:** దివ్యదృష్టి, దివ్యశ్రవణం, పూర్వజన్మజ్ఞానం, ఇతరుల మనస్సును గ్రహించుట,



ఆకాశగమనం, అగోచరమైన విషయాల్ని తెలుసుకొనుట. అనే ఈ ఆరు శక్తులు కలవాడు.

**దశబలుడు:** బుద్ధి, ధ్యానం, జ్ఞానం, దయ, శీలం, సహనం, వీర్యం, బలం, దానం, శ్రుతి కలవాడు.

**బుద్ధుడు:** బోధివృక్షం (రావిచెట్టు) క్రింద జ్ఞానోదయం కలిగినవాడు.

**సిద్ధార్థుడు:** అన్నీ సిద్ధించిన వాడు.

**గౌతముడు:** గౌతమ గోత్రుడు.

**కామమును పారద్రోలి దుఃఖమ్ము కూల**
**ద్రోసి, మాత్సర్య గుణమును ద్రుంచివైచి**
**బ్రతుకుబాటలు దీర్చిన రాజఋషివి!**
**బుద్ధదేవా! స్తుతింతు నీ పుణ్యచరిత!**